క్లుప్తంగా

మరిడమ్మకు ప్రత్యేక పూజలు



భక్తురాలిని ఆశీర్వదిస్తున్న అర్చకుడు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు, పంచామృతాభిషేకం , ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ట్రస్టీ చింత పల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమం నిర్వహించారు.

ఉత్తమ సేవకులకు దుస్తుల పంపిణీ



పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేసిన చైర్ పర్సన్, వైస్ చైర్మన్ తదితరులు

సామర్లకోట: విజయవాడ వరదల్లో మున్సిపాలిటీకి చెందిన 32 మంది పారిశుధ్య కార్మికులు ఉత్తమ సేవలందించారని మున్సిపల్ చైర్పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. వారందరికీ శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. చైర్ పర్సన్ మాట్లాడుతూ ఇతర ప్రాంతాలకు వెళ్లి సేవలందించిన వారిని గుర్తించాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఈ మేరకు రెండు జతల చొప్పున దుస్తులు, యాప్రాన్లు అందజేశారు. శానిటరీ ఇన్స్పెక్టరు రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ ఉబా జాన్‌మోజెస్, కౌన్సిలర్లు, నేతల హరి బాబు, సేపెని సురేష్, స్వయంభారపు వీరభద్రరావు, నమ్మి దుర్గభవాని, పాలిక కుసుమ, ఇన్‌చార్జి కమిషనర్ టి.కనకరాజు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పంపిణీ



మహిళలకు సర్టిఫికెట్లు అందిస్తున్న అధికారులు

కొత్తపల్లి: మండలంలోని మూలపేటలోని ప్రతిభ కేంద్రంలో శుక్రవారం అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాకినాడ సెజ్ ప్రాంతంలో నిరుద్యోగులైన యువతీ, యువకులకు కంప్యూటర్ కోర్సులపై శిక్షణ నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఆ సంస్థ ప్రతినిధులు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ప్రతిభా కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న 45 మంది మహిళలకు అరబిందో ఫార్మా ఫౌండేషన్ జనరల్ మేనేజర్ సుధాకర్, సెంట్రల్ యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య దయానంద్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సామర్లకోట అధికారుల ఫోన్ నంబర్లు

మున్సిపాలిటీ	
మున్సిపల్ కమిషనర్	98499 05808
మున్సిపల్ మేనేజర్	98499 07118
మున్సిపల్ డీఈ	96769 68282
మున్సిపల్ ఏఈ	98499 07122
మున్సిపల్ ఆర్వో	98499 07120
మున్సిపల్ ఆర్ఐ	90146 00920
మున్సిపల్ టీపీఓ	98499 07123
శానిటరీ ఇన్‌స్పెక్టర్	77024 48282
అకౌంట్స్ ఆఫీసర్	98499 02447
ప్రభుత్వాస్పత్రి	
సూపరింటెండెంట్	80082 88125
పశు సంవర్ధక శాఖ ఏడీ	94418 60299
తహసీల్దార్	98499 03876
ఎంఈఓ-1	85558 71069
ఎంఈఓ-2	94410 73418
ట్రాన్స్‌కో ఏడీఈ	94408 12600
ట్రాన్స్‌కో ఏఈ	94408 12634
ట్రాన్స్‌కో ఏఈ రూరల్	94408 12686

కొత్తపల్లి మండల అధికారులు

తహసీల్దార్	91542 47464
ఎంపీడీఓ	94401 13090
ఇంజినీర్	99890 78030
ఎలక్ట్రికల్ ఏఈ	94408 12642
హౌసింగ్ ఏఈ	70939 30455
ఈఓపీఆర్డీ	99489 27333
ఉపాధి హామీ పథకం ఏపీఓ	83744 46378
డ్వాక్రా ఏపీఎం	89788 81622
ఎస్సై	94409 00752
సీఐ పిఠాపురం	94407 96523
వ్యవసాయ శాఖ ఏఓ	83310 56594
కొత్తపల్లి పీహెచ్‌సీ డాక్టర్	99890 69546
నాగులపల్లి పీహెచ్‌సీ డాక్టర్	98497 28671
కొమరగిరి పీహెచ్‌సీ డాక్టర్	92466 90633
ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ	89858 28380
ఎంఈఓ	92467 34465
ఐసీడీఎస్ సీడీపీఓ	94408 14692
ఇరిగేషన్ జేఈ	83310 75078

ఎలుకకు ఎర వేసేదెప్పుడో!

- ఇప్పటి వరకు స్పందించని ప్రభుత్వం
- వరిని కాపాడుకునేందుకు రైతుల అగచాట్లు
- సంప్రదాయ బుట్టలవైపే అన్నదాత మొగ్గు



పొలంలో బుట్టల ఏర్పాటుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

పిఠాపురం: దుబ్బు దశలో ఉన్న వరి పైరుపై ఎలుకల దాడి తీవ్రమైంది. ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం చేపట్టాల్సి ఉండగా ఆ దిశగా చర్యలు లేవని రైతులు వాపోతున్నారు. ఎలుకల నివారణకు అనేక మందులు, పద్ధతులు ఉన్నప్పటికీ పాత కాలపు బుట్టల ఏర్పాటుపైనే రైతులు ఆసక్తి చూపుతున్నారు.

పలు కుటుంబాలు జీవనోపాధిగా ఈ బుట్టల ఏర్పాటును తీసుకోగా రైతులు వాటిని వినియోగించుకుంటున్నారు. ఎకరానికి 40 నుంచి 50 బుట్టలు చేస్తే వాటిలో రోజుకు 20 నుంచి 35 వరకు ఎలుకలు పడుతున్నట్లు రైతులు చెప్తున్నారు. బుట్టలు ఏర్పాటు చేసే వారికి ఒక్కో ఎలుకకు రూ.50 ఇస్తున్నారు. ఈ విధానం సత్ఫలితాలు ఇస్తున్నట్టు రైతులు చెబుతున్నారు.

నష్టం ఇలా కలిగిస్తాయి

ఎలుక జాతుల్లో పంది కొక్కు, చిన్న పంది కొక్కులు, ఇళ్లల్లో తిరిగే ఎలుకలు పంటలకు ఎక్కువ నష్టం కలిగిస్తాయి. ఎలుకలు ఉలి వంటి పళ్లతో వస్తువులను సులభంగా కొరుకుతాయి. వీటి పళ్లు రోజుకు 0.4 మిల్లీ మీటర్లు పెరుగుతూ దాని కపాలాన్ని చీల్చేస్థాయికి పెరిగిపోతాయి. అందుకే వాటిని అరగదీసేందుకు ఎలుకలు కనిపించిన వాటన్నింటినీ కొరుకుతుంటుంది. నాటిన పొలంలో వరి దుబ్బులను ఏటవాలుగా 45 డిగ్రీల కోణంలో నీటి మట్టం పైభాగంలో కత్తిరించి పంటలకు నష్టం కలిగిస్తాయి. కాండాన్ని, మొవ్వులను తింటాయి. కుదురు ఏర్పడిన నాటి నుంచి కోత కోసే వరకు ఎలుకలు పంటలకు నష్టం కలిగిస్తుంటాయి. కంకులను కత్తిరించి ఈడ్చుకుని పోయి బొరియలలో దాచి ధాన్యాగారాలను ఏర్పరుచుకుంటాయి. పాలు పోసుకుంటున్న కంకులు కొంచెం గట్టి పడిన కంకులు ఎలుకలు చాలా ఇష్టంగా తింటాయి. అవి తినే దాని పరిమాణం కన్నా 7–8 రెట్లు అధికంగా పాడు చేస్తాయి. పంట కోసిన తరువాత పనల మీద కళ్లంలో గిడ్డంగులలో కూడా ఇవి నష్టం కలిగిస్తుంటాయి. పగలు బొరియలలో ఉండి రాత్రి పూట సంచరించి పంటలను నాశనం చేస్తుంటాయి. పంటలు లేని సమయంలో ఎలుకలు వలస వెళ్తుంటాయి.

ఈ వారంలో ప్రారంభిస్తాం

ఈ నెల మొదటి వారంలో జిల్లాలో ఒకే సారి సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం చేపట్టడానికి ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన వెంటనే కార్యక్రమం ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నాం. సామూహిక ఎలుకల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు ఇప్పటికే రైతులకు వివరిస్తున్నాం. అవగాహనా సదస్సులు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నాం.

– సత్యనారాయణ, వ్యవసాయశాఖాధికారి, గొల్లప్రోలు

ఇలా నివారించాలి

వేసవిలోను దమ్ము సమయంలో గట్లను చెక్కి ఎలుకల బొరియల పరిమాణాన్ని తగ్గించాలి. గట్లపై కలుపు మొక్కలను తీసి వేయాలి. వీలున్నంత వరకు ఒక ప్రాంతంలో నాట్లు ఒకేసారి వేసుకోవాలి. పైరులో ప్రతి 8 నుంచి 12 అంగుళాల బాటలు వేసుకోవాలి. పొలాల్లో బోనులు, బుట్టలు ఉపయోగించి పైరు తొలి దశలోనే ఎలుకలను నివారించుకోవాలి. ఎలుకల బొరియలలో ఊదర గొట్టాన్ని ఉపయోగించి పొగ బెట్టి నివారించుకోవాలి. ఎలుకల నిర్మూలనకు రసాయనాలలో ప్రధానంగా రక్తం గడ్డ కట్టించే అన్న వాహిక ద్వారా ఉపయోగించే ఏక మోతాదులో వాడే బ్రోమోడయోలిన్ మందును వాడి పూర్తిగా నివారించుకోవచ్చు. అయితే ఈ మందును పంపిణీ చేయాల్సిన ప్రభుత్వం ఇంకా ఆ ఊసెత్తడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చురుగ్గా వంతెన మరమ్మతులు



గోదావరి కాలువపై ఉన్న వంతెనకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సామర్లకోట: స్థానిక గోదావరి కాలువపై పంచారామ క్షేత్ర ముఖద్వారం వద్ద ఉన్న ఐరన్ వంతెన మరమ్మతులు జోరుగా సాగుతున్నాయి. పంచారామ క్షేత్రంలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు భక్తులు గోదావరి కాలువ దాటి ఆలయానికి చేరాల్సి ఉంది. భక్తులకు దగ్గర మార్గమైన ముఖద్వారం ఎదుట గతంలో పంటు ఏర్పాటు చేసే వారు. భక్తులు రద్దీగా ఉన్న సమయంలో ప్రమాదాలు జరుగుతుండడంతో దాత మట్టే శ్రీనివాసు సహకారంతో సుమారు ఏడేళ్ల క్రితం ఇనుప వంతెన నిర్మించారు. భక్తులు నడిచి వెళ్లేలా ఇనుప రేకులు వేయడంతో నీటికి రేకులు తుప్పు పట్టి పాడయ్యాయి. ప్రస్తుత మహాశివరాత్రి నాటికి వంతెన మరమ్మతులు చేయాలని ఇటీవలి సమావేశంలో భక్తులు సూచించగా, దేవదాయశాఖ ఆధ్వర్యంలో వంతెనపై తుప్పుపట్టిన రేకులను తొలగించి ఇనుప కమ్మీలను ఏర్పాటు చేస్తున్నారు. ఈఓ బళ్ల నీలకంఠం ఈ పనులను పరిశీలించారు. పంచారామ క్షేత్రానికి భక్తులు చేరుకోడానికి రైల్వే గేటు ఎదురుగా వంతెనతో పాటు మాండవ్యనారాయణస్వామి ఆలయం వద్ద గోదావరి కాలువపై కాలిబాట వంతెనలు ఉన్నాయి.

డీఈ తీరుపై ధ్వజమెత్తిన కౌన్సిల్

- సభ్యుల ప్రశ్నకు సరిగా సమాధానం చెప్పాలని ఆగ్రహం
- పలు పట్టణ సమస్యలపై సమావేశంలో చర్చ



సభ్యులకు సమాధానం ఇస్తున్న చైర్‌పర్సన్

సామర్లకోట: మున్సిపల్ డీఈ కె.శశిధర్ తీరుపై కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. అజెండాలో అంశాలు చర్చించే ముందు పట్టణం సమస్యలపై చర్చకు జీరో అవర్ ఇవ్వాలని సభ్యులు కోరడంతో చైర్‌పర్సన్ అనుమతించి వాటిని సమోదు చేసుకోవాలని సూచించారు. తాగునీటి సమస్య మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు అడిగిన ప్రశ్నపై డీఈ తెలుసుకొని మాట్లాడాలని అనడంతో కో ఆప్షన్ సభ్యుడు చంద్రరావు అభ్యంతరం వ్యక్తం చేశారు. విషయం తెలియక పోవడం వల్లే ప్రశ్నించామని, దీనికే అజెండా పంపారని డీఈ సమాధానం సక్రమంగా లేదని చైర్‌పర్సన్ దృష్టికి తీసుకు వెళ్లారు. దాంతో వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్, పలువురు సభ్యులు డీఈ ప్రవర్తనను తప్పు పడుతూ సీనియర్ సభ్యుడిని అవమాన పరిచేలా సమాధానం ఉన్నదని చైర్‌పర్సన్ అరుణ అన్నారు. అనంతరం డీఈ సమాధానం ఇస్తూ గోదారి జలాలను శ్యాంపిల్స్ తీసి కాకినాడ ఆర్‌డబ్ల్యూఎస్ ల్యాబ్‌కు పంపినట్టు తెలిపారు. గోదావరి కాలువలో కాలుష్రిత జలాలు ఎక్కువగా కలవడం వల్ల బోరు నీరు ఇవ్వడానికి నిర్ణయించామని ఏఈ రమేష్ తెలిపారు.

మున్సిపల్ స్థలంలో ట్రాన్స్‌ఫార్మర్లపై చర్యలు ఏవీ మున్సిపాలిటీ స్థలంలో బుధవారం సంతమార్కెట్‌లోని చేపల షెడ్ల వద్ద ప్రైవేటు సంస్థల కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లపై ఎటువంటి చర్యలు తీసుకున్నారని సభ్యులు పిట్టా సత్యనారాయణ, నేతల హరిబాబు, అనుమతి లేకుండా ఎలా ఏర్పాటు చేస్తారని వైస్ చైర్మన్ మోజెస్ ప్రశ్నించారు. దీంతో ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకువెళ్లి తొలగిస్తామని ఏఈ తెలిపారు. కుక్కల బెడదపై స్వయంభారపు వీరభద్రరావు ప్రశ్నించగా, కుక్కలకు ఆపరేషన్లు చేయిస్తామని, అందుకు ఒకొక్క దానికి రూ.1500 ఖర్చవుతుందని శానిటరీ ఇన్‌స్పెక్టరు రాజశేఖర్ తెలిపారు. ఒకటో వార్డు నుంచి ఈ ఆపరేషన్లు ప్రారంభించాలని చైర్‌పర్సన్ ఆదేశించారు. మున్సిపల్ మేనేజరు టి. కనకరాజు ఇన్‌చార్జి కమిషనర్‌గా సమావేశానికి హాజరయ్యారు.

ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించాలి



ట్రాన్సుఫార్మర్లు తొలగించాలని వినతి పత్రాలు అందజేసిన మత్స్య వ్యాపారులు

సామర్లకోట: చేపల మార్కెట్‌కు అడ్డుగా ఏర్పాటు చేసిన ట్రాన్సుఫార్మర్లు తొలగించాలని ఈపీడీసీఎల్ ఈఈ ఏవీఎస్‌డీఎస్ ప్రభాకర్‌కు వ్యాపార సంఘ నాయకులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ ఏర్పాటును తాము వ్యతిరేకించినప్పటికీ తాము లేని సమయంలో ట్రాన్సుఫార్మర్ అమర్చారని నాయకులు పంతాడి వీరబాబు, వెంకటరమణ, సంగీడీ ఈశ్వరరావులు తెలిపారు. దాని వల్ల తమకు ప్రమాదం పొంచి ఉన్నదని వారు పేర్కొన్నారు. కాగా మున్సిపాలిటీ అనుమతి లేకుండా ట్రాన్సుఫార్మర్లు ఏర్పాటు చేసిన వాటిని తొలగిస్తామని ఈఈ హామీ ఇచ్చారు. దీనిపై నివేదిక ఇవ్వాలని ఏఈ రమేష్‌కుమార్‌కు సూచించారు.

పార్కులు, పారిశుధ్య నిర్వహణ అధ్వానం

- సమస్యలపై మున్సిపల్ కౌన్సిల్ సమావేశం
- మాజీ చైర్‌పర్సన్ శ్రీదేవికి సభ్యుల సంతాపం



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ రాజశేఖర్

పెద్దాపురం: ప్రజా సమస్యలపై మున్సిపల్ కౌన్సిల్ ధ్వజమెత్తింది. పారిశుధ్యం, పార్కుల నిర్వహణ, బిల్లులు చెల్లింపులు తదితర సమస్యలపై, సిబ్బంది సమన్వయ లోపం పుర ప్రజలకు శాపంగా మారిందని కౌన్సిల్ సభ్యులు ధ్వజమెత్తింది. పెద్దాపురం పురపాలక సంఘ సర్వ సభ్య సాధారణ సమావేశం శుక్రవారం మున్సిపల్ చైర్మన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరిగింది. కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ మాట్లాడుతూ పారిశుధ్యం అధ్వానంగా ఉందని, శతాబ్దిపార్కును కౌన్సిల్ ఆమోదం లేకుండా కాంట్రాక్టుకు ఎలా ఇస్తారని, అందులోకి ప్రవేశం ఉచితమని చెప్పి ఇప్పుడు ఫీజు ఎలా వసూలు చేస్తారని ప్రశ్నించారు. శానిటరీ ట్రాక్టర్ల నిర్వహణ అధ్వానంగా ఉందని నిలదీశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ మాట్లాడుతూ సిబ్బంది పనితీరు మార్చుకోవాలన్నారు. కౌన్సిలర్ త్సలిక సత్యభాస్కర్ మాట్లాడుతూ శ్మశాన వాటికల్లో సిబ్బందికి జీతాల పెండింగ్‌పై ప్రశ్నించారు. తొలుత మున్సిపల్ మాజీ చైర్మన్ బుచ్చి శ్రీదేవి మృతి పట్ల కౌన్సిల్ రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం కౌన్సిల్ సమావేశం కొనసాగింది. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, డీఈ ప్రకాశరరావు, మేనేజర్ జ్యోతిరాణి, మాజీ చైర్‌పర్సన్ ముప్పన శ్యామలాంబ, కౌన్సిలర్లు విడదాసరి రాజా, ఆరెల్లి వీర్రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా పశువైద్య శిబిరాలు

- జేడీ సూర్యప్రకాష్



రైతులకు పశువుల మందులు అందజేస్తున్న నాయకులు, అధికారులు

పిఠాపురం: పశు ఆరోగ్య శిబిరాలు మండలంలో అన్ని గ్రామాలలో విజయవంతంగా పూర్తి చేసినట్లు జేడీ డాక్టర్ సూర్యప్రకాష్ తెలిపారు. గొల్లప్రోలు మండలం మల్లవరంలో శుక్రవారం నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరంతో పాటు ఏర్పాటు చేసిన దూడల ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఆధ్వర్యంలో స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ హిమజ రైతులకు దూడల పెంపకంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ ద్వారా నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూర్యప్రకాష్ రైతులకు సూచించారు. గత నెల 21 నుంచి 31వ తేదీ వరకు ఈ శిబిరాలు నిర్వహించినట్టు ఆయన తెలిపారు. ఈ శిబిరంలో 52 పెద్ద పశువులను, 200 చిన్న జీవాలకు నట్టల నివారణ మందులు తాగించి, 20 పశువులకు గర్భకోశ వ్యాధులకు ఉచితంగా చికిత్సలు చేసి మందులు పంపిణీ చేశారు. పలు గొర్రెలకు మసూచి వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమములో డీడీ అంబేద్కర్, ఏడీ ఎం.శ్రీనివాస్, పశువైద్యాధికారులు ప్రశాంత్, చైతన్య, రవితేజ, నరసింగరావు పలువురు రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన దూడల ప్రదర్శనలో విజేతలకు అధికారులు బహుమతులు అందజేశారు.

దోమల మోతపై కౌన్సిలర్ల నిలదీత

- గొల్లప్రోలు నగర పంచాయతీ సమావేశం
- పలు అంశాలపై సమగ్రంగా చర్చ



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

పిఠాపురం: దోమల మోతపై కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. గొల్లప్రోలు నగర పంచాయతీ బడ్జెట్ సమావేశం శుక్రవారం చైర్ పర్సన్ గంధ్రేటి మంగతాయారు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేవంలో పదో వార్డు కౌన్సిలర్ మొగలి దుర్గానందరావు, 14వ వార్డు కౌన్సిలర్ దాసం దేవి మాట్లాడుతూ నగర పంచాయతీలో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై కమిషనర్ కనకారావు మాట్లాడుతూ యాంటీ లార్వా ఆపరేషన్ మొదలు పెడతామన్నారు. మున్సిపల్ స్టాకు యార్డులో జరిగిన అగ్ని ప్రమాదంలో యంత్రాలు అన్నీ కాలిపోయాయని కొత్త యంత్రాల కొనుగోలుకు ప్రతిపాదనను తయారు చేశామని ఆయన తెలిపారు. మూడవ వార్డు కౌన్సిలర్ మైనం భవాని మాట్లాడుతూ డ్రైన్లను శుభ్రం చేయాలని పేర్కొనగా కమిషనర్ బదులిస్తూ మార్చిలోపు టెండర్లు పిలిచి పూడికలు తీయిస్తామని పేర్కొన్నారు. వీధిలైట్లు వేయాలని కౌన్సిలర్ గుళ్ళ సుబ్బారావు, రాజుచెరువు గట్టుపై వ్యర్థాలు వేస్తున్నారని కో ఆప్షన్ కౌన్సిలర్ మొగలి జయబాబు కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో సాధారణ సమావేశాన్ని రద్దు చేశారు.

రూ.172.05 లక్షలు మిగులు బడ్జెట్ ఆమోదం

గొల్లప్రోలు నగర పంచాయతీ 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.172.05 లక్షల మిగులుతో రూపొందించిన అంచనా బడ్జెట్‌ను పాలక వర్గం ఏకగ్రీవంగా ఆమోదించారు. అన్ని మార్గాల ద్వారా రూ 783.82 లక్షల ఆదాయం వస్తుందని ప్రారంభ నిల్వ రూ.670.13 లక్షలతో కలిపి ఆదాయం రూ.1453.95 లక్షలుగా ఉంటుందని వివరించారు. అన్ని మార్గాల ద్వారా రూ.1281.91 లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారు.

హెల్మెట్ ధారణ కుటుంబానికి శ్రేయస్కరం



రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కాకినాడ రూరల్: హెల్మెట్ ధరించి ప్రయాణించడం వల్ల కుటుంబానికి శ్రేయస్కరమని నేషనల్ హైవే అథారిటీస్ ఇంజినీరు శ్రీనివాస్ పేర్కొన్నారు. అచ్చంపేట జంక్షన్ కూడలి వద్ద శుక్రవారం ఉదయం రహదారి భద్రతపై ఆర్వోఎస్ఎల్ ప్రాజెక్టు, జేపీ కన్‌స్ట్రక్షన్స్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం వాహనచోదకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల నుంచి తప్పించుకోవచ్చునని అన్నారు. పలువురు వాహన చోదకులను ఆపి వారితో హెల్మెట్ ధరిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్వోఎస్ఎల్ ప్రాజెక్టు మేనేజరు అనంతరావు, కో ఆర్డినేటరు చక్కని ప్రభాకరరావు, జేపీ కన్‌స్ట్రక్షన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

పీఏడీఏ పీడీగా శ్రీధర్

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న డిప్యూటీ కలెక్టర్ ఎస్. శ్రీధర్‌ను పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీకి (పీఏడీఏ) నియమిస్తూ కలెక్టర్ షణ్మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు, పిఠాపురం ప్రాంతీయ అభివృద్ధి కోసం కలెక్టర్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఆరుగురు అధికారులను రీ డిప్లాయిమెంట్ విధానంలో నియమించారు.

ఫిజియోథెరపీపై అవగాహన

ప్రత్తిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు ప్రారంభించారు.

విలేకరి మృతిపై విచారణ చేయాలి

సామర్లకోట: స్థానిక గోదావరి కాలువలోని విలేకరి మృతిపై పూర్తి స్థాయి విచారణ జరపాలని జిల్లా జర్నలిస్టుల అసోసియేషన్ ప్రతినిధులు, కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సీఐ ఎ.కృష్ణభగవాన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సలీమ్ మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయని, అతని భార్య, పిల్లలకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. సలీమ్‌తో వచ్చిన మహిళతో పాటు మరో వ్యక్తిపై అనుమానం ఉందని ఇద్దరినీ అదుపులోనికి విచారించాలన్నారు. జర్నలిస్టు ప్రతినిధులు స్వాతిప్రసాద్, దుర్రాని, నవీన్, మున్ని, వైఎస్సార్ సీపీ పెద్దాపురం మైనార్టీ సంఘ అధ్యక్షుడు జానీ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బాలలతో భిక్షాటన చేయిస్తే నేరం



సామర్లకోట రైల్వే స్టేషన్‌లో అవగాహన ర్యాలీ



సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ లేబర్ కమిషనర్ బుల్లి రాణి

సామర్లకోట: బాలలతో భిక్షాటన చేయించడం నేరమని, అటువంటి వారిని గుర్తిస్తే జైలు శిక్ష తప్పదని జిల్లా బాలల పరిరక్షణ అధికారి సీహెచ్ వెంకట్రావు అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం సంచార జీవులు ఏర్పాటు చేసుకున్న గుడారాల వద్ద ర్యాలీతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరికీ బాల్యం ఎన్నో జ్ఞాపకాలు ఇస్తుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ పాఠశాలలో పాఠాలు, ఆటలతో గడపాలన్నారు. రైల్వే స్టేషన్, బస్సు కాంప్లెక్స్, ఆటో స్టాండ్, పబ్లిక్ ప్రదేశాలు, ముఖ్య కూడళ్లలో భిక్షాటనలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వీటిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. శుక్రవారం ఆరుగురు భిక్షాటన చేస్తున్న తల్లులతో బాలలను గుర్తించినట్టు తెలిపారు. ఈ మేరకు వారికి కౌన్సిలింగ్ ఇచ్చి సమీపంలోని పాఠశాలల్లో చేర్చేలా ఎంఈఓ పి.పుల్లయ్యకు సూచించారు. ఇప్పటికే గుర్తించిన వారు తిరిగి భిక్షాటనలో కనిపిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించి వారి వద్ద నుంచి లిఖిత పూర్వకంగా లేఖ తీసుకున్నారు. కార్యక్రమంలో బాలల సంరక్షణాధికారులు కె.శ్రీనివాస్, జె.విజయ, సుధాకర్, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్లు బి.శ్రీనివాసు, చిన బాబు, దుర్గాభవాని, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రవి, ఎంఈఓ 2 పి.పుల్లయ్య, క్రాఫ్ట్ ఎన్‌జీఓ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను పనికి పంపొద్దు

పిఠాపురం: బడి ఈడు పిల్లలంతా బడిలోనే ఉండేలా తల్లిదండ్రులు సహకరించాలని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఎస్.బుల్లిరాణి కోరారు. అంతర్జాతీయ వీధి బాలల దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక భగత్‌సింగ్ నగర్ (యానాదుల కాలనీ) లో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ 14 ఏళ్లలోపు బాల బాలికలు అందరూ బడిలోనే ఉండాలన్నారు. పిల్లలతో పనులు చేయించరాదని, చదువుకోవడం ద్వారా పిల్లలు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదుగుతారని ఆమె చెప్పారు. పిల్లల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. భవన ఇతర నిర్మాణాల్లో పనిచేసే కార్మికులు కూడా తమ పేర్లు కార్మిక శాఖ వద్ద నమోదు చేసుకోవాలని, తద్వారా కార్మిక శాఖ ద్వారా అమలు చేసే పథకాలు పొందవచ్చన్నారు. సదస్సులో న్యాయవాదులు అనిశెట్టి కాశీ విశ్వనాథరెడ్డి, గుడిమెళ్ల శ్రీ భాస్కరాచార్యులు మాట్లాడుతూ బడి వయసు పిల్లలు వీధి బాలలుగా, భిక్షాటనలో, చెత్త సేకరించే పనులలో, ప్రమాదకర పనుల్లో ఉంటే వారి విలువైన బాల్యం కోల్పోయి చెడు వ్యసనాలకు బానిసలై సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే ప్రమాదం లేకపోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు



విద్యుద్దీప కాంతులతో పాదగయ క్షేత్రం

పిఠాపురం: పాదగయ క్షేత్రంలో ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ తెలిపారు . పాదగయ క్షేత్రంలో శ్రీరాజరాజేశ్వరి సమేత ఉమా కుక్కుటేశ్వరస్వామివారి దివ్య కల్యాణం ఈనెల 24వ తేదీ సోమవారం రాత్రి 8.32 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ ఆయన తెలిపారు. 25వ తేదీ మంగళవారం ప్రత్యేక అభిషేకాలు, 26వ తేదీ బుధవారం మహాశివరాత్రి ఉత్సవం, 27వ తేదీ గురువారం మధ్యాహ్నం 3 గంటలకు నాకబలి, రథోత్సవం, 28న త్రిశూల స్నానం, స్వామివారి తెప్పోత్సవం, శ్రీపుష్పోత్సవం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

ఏర్పాట్లపై సమీక్ష

పాదగయ క్షేత్రంలో మహా శివరాత్రి ఏర్పాట్లపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఓఎస్‌డీ మధుసూదనరావు అధికారులతో శుక్రవారం సమీక్షించారు. లక్షల్లో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పటిష్టమైన క్యూలైన్లు ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ శాఖను ఆదేశించారు. పుణ్య స్నానాలకు ఏర్పాట్లను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చూడాలని, వివిధ శాఖలకు ఆయా బాధ్యతలను అప్పగించారు. ఆలయ ఈఓ కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర నామా కనకారావు తదితరులు పాల్గొన్నారు.